
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 ఫిబ్రవరి 2023
5
ఏలూరు



ఐపిఎస్ అధికారిగా ఎస్‌కె.ప్రవీణ్‌గౌతమ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరానికి చెందిన కంభం శామ్యూల్ ప్రవీణ్ ఐపిఎస్ అధికారిగా శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ప్రవీణ్ గౌతమ్ పాఠశాల విద్య ఏలూరు సిఎస్ఐ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పూర్తి చేశారు. నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అనంతరం ప్రతిష్టాత్మక తిరుచ్చి ఎన్ఐటి విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పట్టభద్రులయ్యారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఢిల్లీలో సివిల్స్ శిక్షణ తీసుకున్నారు. సివిల్స్ పరీక్షలు రెండో సారే ఉత్తమ ర్యాంకు సాధించి ఐపిఎస్ ఎంపిక చేసుకున్నారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపిఎస్ 2020 బ్యాచ్‌లో ఎంపికయ్యారు. కానీ కరోనా కారణంగా 2021 బ్యాచ్‌లో ఐపిఎస్ అధికారిగా శిక్షణ పూర్తి చేసుకుని, శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.



మాట్లాడుతున్న హైమావతి

బిజెపి విధానాలు వినాశకరం

ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశంలో మళ్లీ సతీ సహగమన విధానం అమలు చేయాలని చూస్తోందని, ఇలాంటి అనేక ప్రమాదకర విధానాలను ప్రధాని మోడీ అవలంబించాలని చూస్తున్నారని ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అన్నారు. శనివారం పవర్‌పేటలోని ఐద్వా కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుంచి మనువాద శాస్త్రం పద్ధతులు అమలు చేయాలని చూస్తుందని విమర్శించారు. దానికి ఇటీవల పార్లమెంట్‌లో సతీసహగమనం మన సాంప్రదాయం అని, దాన్ని అమలు చేయాలని సాక్షాత్తు బిజెపి ఎంపీ ప్రకటించడమే నిదర్శనమన్నారు. ఆ ఎంపీ మాటలను ప్రధాని ఖండించకపోవడం వారి బుద్ధి తెలియజేస్తుందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక గ్యాస్ ధర రూ.400 నుండి రూ.1100కు చేరిందన్నారు. పెట్రోల్ ధర రూ.45 నుండి రూ.111కు పెరిగిందన్నారు. ఫలితంగా అన్ని నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. వీటిపై ఐద్వా పోరాడుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు నిర్మల, దివ్య, ఉషారాణి, శారద, సైదాని, సుకన్య, స్వర్ణలత పాల్గొన్నారు.

13న యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం కలిదిండి మండల కేంద్రమైన కలిదిండిలో శ్రీ కళ్యాణి ఫంక్షన్ హాలులో ఫిబ్రవరి 13వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులందరూ కలిదిండి స్పందన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యాన పంటల రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు

నిమ్మ, అరటి, కూరగాయలు తదితర ఉద్యాన పంటల రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో జరిగిన రైతుల సమావేశంలో ఉద్యాన పంటల రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. నిమ్మ, అరటి, కొబ్బరి, కూరగాయలు తదితర పంటలకు కనీస ధర రాక రైతాంగం నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీ పథకాలు అమలు కావడం లేదన్నారు. దొండ పందిళ్ల రైతుల సబ్సిడీ బకాయిలు నాలుగేళ్లుగా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మార్కెట్లో కనీస ధర రాక నష్టపోతున్న సందర్భాల్లో ధరల స్థిరీకరణ నిధి పథకం అమలు కావడం లేదన్నారు. అరటి, నిమ్మ, కొబ్బరి రైతులకు ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యాన పంటలు రైతులకు ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందించాలని కోరారు.

కొబ్బరి మొక్కల కుంభకోణంపై విచారణ జరపాలి

సామాజిక వన విభాగం 2019-20 ఆర్థిక సంవత్సరంలో అటవీశాఖ ద్వారా చేపట్టిన కొబ్బరి మొక్కల పెంపకం, పంపిణీలో జరిగిన భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెం, లింగపాలెం మండలం భోగోలు, రంగాపురంలో సామాజిక వనం కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకంలో కొబ్బరి మొక్కలు పెంచి రైతులకు పంపిణీ చేసే పథకాన్ని పక్కదారి పట్టించి లక్షల రూపాయలు కుంభకోణానికి పాల్పడడం దారుణమని విమర్శించారు. రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అనుమోలు మురళీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

'పోలవరం' కార్మికుల మెస్‌లో


ఆహారం కలుషితం

88 మందికి అస్వస్థత - నిలకడగా ఆరోగ్య పరిస్థితి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు మెస్-4లో కలుషిత ఆహారం తిని 88 మంది కార్మికులు శనివారం అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి కార్మికులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టులో ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన సుమారు నాలుగు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి పోలవరం ప్రాజెక్టులో భోజన సదుపాయాల కోసం ప్రయివేటు కాంట్రాక్ట్ ద్వారా మెస్ నిర్వహిస్తున్నారు. ఆ మెస్‌లో శుక్రవారం రాత్రి భోజనంలో వంకాయ బంగాళదుంప, పప్పుచారు కూరలతో భోజనాలు వడ్డించారు. అయితే తిన్నవారిలో కొంతమంది వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో కొందరు వెంటనే పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. శనివారం ఉదయానికి మరికొంతమంది అస్వస్థతకు గురి కావడంతో పోలవరం ప్రాజెక్టు వాహనాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. శుక్రవారం రాత్రి నుండి శనివారం మధ్యాహ్నం నాటికి మొత్తం 88 మంది కార్మికులు వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, మిగిలినవారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ప్రాణనష్టం లేదని వైద్యాధికారి గెడ్డం జ్యోతి తెలిపారు.

సమాచారం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ జాన్సీరాణి, పోలవరం ప్రాజెక్టు ఎస్‌ఇ నరసింహమూర్తి, సిఇ సుధాకర్‌బాబు, తహాశీల్దార్ బి.సుమతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిఎంహెచ్‌ఒ నాగేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ మోహన్‌రావు కార్మికులను పరామర్శించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి పలుసూచనలు చేశారు. డిసిహెచ్‌ఎస్ మోహన్‌రావు మాట్లాడుతూ 46 మంది చికిత్స తీసుకుని వెళ్లిపోయారని, అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు. ఆహారం కలుషితం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. విచారణ చేస్తున్నామని, ఆహారం, నీరు శాంపిల్స్ సేకరించామని పరీక్షల అనంతరం వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.



అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

ప్రస్తుతం కార్మికుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు పోలవరం ప్రాజెక్టులో, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వద్ద అంబులెన్సులు సిద్ధం చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టులో అత్యవసర మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని, అవసరమైన మందులను, వైద్యులను, సిబ్బందిని ప్రాజెక్టు ప్రాంతానికి తరలించినట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, అత్యవసర పరిస్థితుల్లో స్పందించి వైద్యసేవలు అందించిన వైద్యులను, సిబ్బందిని అభినందించారు. ప్రస్తుత పరిస్థితులను జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు.

అస్వస్థతకు గురైన కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిఇ సుధాకర్ బాబుని ఆర్‌డిఒ కోరారు. గతంలో పోలవరం ప్రాజెక్టులో అత్యవసర సేవల కోసం ఆరోగ్య కేంద్రం ఉండేదని, ఇప్పుడు మళ్లీ వైద్య ఆరోగ్య కేంద్రం సేవలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని, కార్మికులకు పంపిణీ అయ్యే ఆహారంపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తామని సిఇ సుధాకర్ బాబు తెలిపారు.



మాట్లాడుతున్న రవి

ఆయిల్‌పామ్ కార్మికులకు

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి


ప్రజాశక్తి - ఏలూరు

ఆయిల్‌పామ్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి పామాయిల్ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం ఏలూరులోని అన్నే భవనంలో పార్వతిపురం జిల్లా పామాయిల్ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఎం.శ్రీను అధ్యక్షతన నిర్వమించారు. ఏలూరు, పార్వతీపురం జిల్లాల జిల్లా కమిటీ సభ్యులు, పామాయిల్ కార్మికులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎ.రవి మాట్లాడుతూ పామాయిల్ కార్మికులు ఇటీవల కాలంలో గెలలు నరుకుతూ విద్యుత్ షాక్ గురై పది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అనేక మంది చెట్లు మీద నుంచి పడిపోయి మంచానికి పరిమితమయ్యారన్నారు. చెట్లెక్కే సమయంలో పాములు, తేళ్లు జర్రలు, తేనెటీగలు కుట్టి ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. ఎత్తైన చెట్లపై పామాయిల్ గెలలు కోసే సమయంలో కరెంటు తీగలు తగిలి షాక్‌కు గురై కాళ్లూ, చేతులు, శరీరం కాలిపోయి ఆసుపత్రి బిల్లులు కట్టలేక ఇల్లు, ఆస్తులు అమ్ముకునే పరిస్థితులు వచ్చాయన్నారు.

ప్రభుత్వం వెంటనే పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది పామాయిల్ కార్మికులు పనిచేస్తున్నారని, పది జిల్లాల్లో పామాయిల్ విస్తారంగా పండుతుందని, రైతుల సంక్షేమానికి ఫ్యాక్టరీలు, ప్రభుత్వం ఎలాగైతే రాయితీలు ఇస్తున్నారో.. అలాగే కార్మికులకూ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాద బీమా వర్తింపజేయాలని, వైద్య ఖర్చులు ప్రభుత్వం అందించాలని కోరారు. పరిహారం అందించే చర్యలు చేపట్టాలని, కార్మికులకు కనీస వేతనం అమలయ్యే చర్యలు తీసుకోవాలని, కార్మికులకు పనిముట్లు ఇతర సౌకర్యాలు సబ్సిడీ ద్వారా కల్పించాలని, ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పామాయిల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మామిళ్ల సత్యనారాయణ, ఎం.రాంబాబు, తాటి సుబ్బారావు, కె.పండు, బి.సోమ్‌బాబు, డి.సత్యనారాయణ, ఎన్.యామి పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు సర్వీస్ పునరుద్ధరించాలి

జంగారెడ్డిగూడెం డిపో వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజలు నిరసన



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని శ్రీనివాసపురం జైనవారి గూడెం, పట్టిన్నపాలెం, రామారావుపేట సెంటర్ కర్రెడ్లగూడెం రెడ్డి గణపవరం మీదుగా ఆర్‌టిసి బస్సు సర్వీస్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టిసి బస్సు డిపో దగ్గర ఆయా గ్రామాల విద్యార్థులు, ప్రజలు కెవిపిఎస్ ఆధ్వర్యంలో బస్సు సర్వీస్ నిలుపుదల చేయడంపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడు తూ జంగారెడ్డిగూడెం నుంచి శ్రీనివాసపురం జైనవారి గూడెం, పట్టిన్నపాలెం, రామారావు పేట సెంటర్, కర్రెడ్లగూడెం రెడ్డి గణపురం బస్సు సర్వీస్ మర్చు చేయడం వల్ల విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ బస్సు సర్వీసును పాత రోడ్డులోనే నడపాలని కోరారు. గ్రామస్తులు విద్యార్థు లకు ఇబ్బంది లేకుండా బస్సు సౌకర్యం తిరిగి ప్రారం భించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి టిడిపి నాయకులు దాసరి శ్యామ్‌చంద్రశేషు మాట్లా డుతూ ఈ బస్సు సర్వీసు లేక విద్యార్థులు చాలా ఇబ్బం ది పడుతున్నారని, ప్రయివేట్ వాహనానికి డబ్బులు పెట్టుకొని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలి పారు. అనంతరం బస్సు డిపో మేనేజర్ కార్యాల యంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు.

లోక్ అదాలత్‌తో ఇరుపక్షాలకు న్యాయం

ప్రజాశక్తి - ఏలూరు

లోక్ ఆదాలత్ ద్వారా రాజీపడి అవార్డు పొందిన కేసుల్లో ఇరుపక్షాలు గెలిచినట్లేనని జిల్లా మొదటి ప్రధాన న్యాయమూర్తి పి.మంగాకుమారి స్పష్టం చేశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన లోక్ ఆదాలత్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పగలు, కక్షలకు పోయి సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగవద్దని హితవు పలికారు. లోక్ ఆదాలత్‌లో రాజీ అయిన కేసులపై న్యాయ స్థానాలకు వెళ్లే అవకాశం లేదని తెలిపారు. అనంతరం రాజీ పొందిన కక్షిదారులకు అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి జి.రాజేశ్వరి, ఎస్‌ఇబి ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు న్యాయస్థానం వేదికగా న్యాయమూర్తి అంజని ఎస్ఎస్.రామఆదిత్య రిషిక్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ మార్గాల ద్వారా 39 క్రిమినల్, ఐదు సివిల్, 210 వరకు ఇతర కేసులు పరిష్కారమయ్యాయని న్యాయ స్థానం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోరింకల విజయరాజు, ఇతర సభ్యులు సహకారం అందించారు.

చింతలపూడి : పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 390 కేసులు రాజీ చేసినట్లు చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి ఇబ్రహిం షరీఫ్ తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు.

గర డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, వైసిపి నాయకులు ఎంఆర్‌డి బలరాం, చెలికాని రాజబాబు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

హమారా ప్రసాద్‌పై చర్యలు కోరుతూ జెఎసి ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించడంతో పాటు దేశ బహిష్కరణ విధించాలని దళిత జెఎసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు నూజివీడు పట్టణం చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత బహుజన పోరాట సమితి (డిబిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాత్మ గాంధీని గాడ్సే కాల్చి చంపినట్లుగా బిఆర్.అంబేద్కర్‌ను కాలుస్తానని సోషల్ మీడియా వేదికగా మాట్లాడిన మతోన్మాది దేశద్రోహి హమారా ప్రసాదును తక్షణమే దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు ప్రశంసించే గొప్ప మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఎంతో గొప్ప పవిత్ర గ్రంధంగా భావిస్తారని చెప్పారు. దేశ పురోగతి రాజ్యాంగంపై ఆధారపడి ఉందనే నిజం ప్రతిఒక్కరూ గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత జెఎసి నేత నత్త నాగేశ్వరరావు, రెంటపల్లి అంబేద్కర్, రామకూరి మరియదాసు, మొగతాటి జ్యోతి బాబు, ఉదయగిరి కృపారావు, తొలిమెల్లి కిషోర్, అయ్యంకి సురేష్‌బాబు, దేవరపల్లి సురేష్, పత్తిపాటి చెన్నప్ప, తురకా మాణిక్యాలరావు, దారా చంటిబాబు, పోల వంటి ప్రేమ్‌చంద్, కొసనం రాజ్‌కుమార్, నెమాని ప్రేమ్‌చంద్, ధర్వేజి దుర్గారావు, జంపన ప్రసాద్, నేతలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జెఎసి నేతలు

సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు

హిందూ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని మాజీ డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయంలో మాజీ ఉపముఖ్యమంత్రి, ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అన్నారు. ద్వారకాతిరుమల దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులుగా ఇటీవల నియమితులైన పెద్దిరెడ్డి పద్మజ్యోతి శ్రీనివాస్ దంపతులు ఏలూరులోని మాజీ డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయంలో ఆళ్ల నానిని శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యునిగా నియమించటంలో సహకరించి ప్రోత్సహించిన ఆళ్ల నానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ పార్టీ కోసం నిస్వార్థంగా సేవలు చేసే ప్రతిఒక్కరికీ పార్టీ అండగా నిలుస్తుం దన్నారు. ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న వైసిపిని అధికారంలోకి తీసుకురావటంలో కార్యకర్తలు అందించిన సేవలు ఎంతో గొప్పవన్నారు. అటువంటి ప్రతిఒక్కరికి వారి సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అండగా నిలుస్తూ తగిన ప్రాధాన్యత నిస్తున్నారని ఆళ్ల నాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్ పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరాం పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కృషి

ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు

ముస్లిం మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అండగా ఉన్నారని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అన్నారు. శనివారపు పేటలో శనివారం జరిగిన హాజరత్ సయ్యద్ జమాల్ షా బాబా మహాత్ముల వారి ఉరుసు కార్యక్రమంలో ఆళ్ల నాని పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు ఆళ్ల నానికి పుష్పగుచ్ఛం అందించి ముస్లిం సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమ కోసం సిఎం జగన్మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీల్లో భాగంగా ఇటీవల ప్రవేశ పెట్టిన షాదీ తోఫా పథకం ద్వారా పేద ముస్లిం కుటుంబాలకు వారి బిడ్డల పెళ్లికి అండగా నిలిచారని అన్నారు. రాష్ట్రంలోని అనేక నామినేటెడ్ పదవుల్లో సైతం జగనన్న ముస్లిం మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యం కల్పించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సహకారంతో ఏలూరులోని పలు మసీదులు, దర్గాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున అండగా నిలిచామని ఆళ్ల నాని తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాల పైగా శనివారపుపేటలోని హాజరత్ సయ్యద్ జమాల్ షా బాబా మహాత్ముల వారి దర్గాలో ఉరుసు కార్యక్రమం నిర్వహించటం పట్ల, దర్గా పోషకాలు అహ్మదుల్లా ఖాన్ కుమారులను ఆళ్ల నాని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, వైసిపి సీనియర్ నాయకులు ఎంఆర్‌డి బలరాం, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, కార్పొరేటర్ గునిపూడి శ్రీనివాస్, ఇమ్మానియేల్ జయకర్, వైసిపి నాయకులు కిలాడి దుర్గారావు, నిడికొండ నరేంద్ర, ఎల్లపు మోజెస్, హాజరత్ సయ్యద్, బాయజీద్ దర్గా ముజావార్లు షేక్ షాబీర్ హుస్సేన్, షేక్ షబ్బీర్ హుస్సేన్, పోలీస్ లైన్ మస్జీద్ కమిటీ అధ్యక్షులు రసూల్, పెన్షన్ మహాల్లా మస్జీద్ కమిటీ అధ్యక్షులు నజీర్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు.. ఏలూరి సోమేశ్వరరావు

నేడు 8వ వర్ధంతి

ప్రభుత్వ ఉద్యోగిగా ఆదర్శవంతమైన సేవలతో, అవినీతిని నిర్భయంగా ఎదిరించిన సాహస కమ్యూనిస్టు నేత ఏలూరి సోమేశ్వరరావు.. తన చిరుప్రాయం నుంచి అనేక ఆర్థిక ఇబ్బందులు, గడ్డు పరిస్థితులు ఎదురైనా చలించక అనేక ఆటుపోట్ల మధ్య చదువు పూర్తిచేసి ప్రభుత్వ దేవస్థానంలో ఉద్యోగంలో చేరారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని, చేనేత సొసైటీ కాలనీలో ఆయన కుటుంబం నివసించేంది. వారి కుటుంబ వృత్తి.. చేనేత. సోమేశ్వరరావు దేవస్థాన ఉద్యోగిగా ఎక్కడకు బదిలీ అయినా, తమది కమ్యూనిస్టు కుటుంబమని సగర్వంగా చెప్పి మరీ విధుల్లో చేరేవారు. ఆయనకు పాలకొల్లు దగ్గరలోని దొడ్డిపట్ల దేవస్థానానికి బదిలీ అయిన సందర్భంలో బాధ్యతలు స్వీకరించే ముందు, తమది కమ్యూనిస్టు కుటుంబమని ప్రకటించి తన నిజాయితీని రుజువు చేసుకున్నారు. అలాగే శివదేవుని చిక్కాల గ్రామ దేవస్థానంలో పనిచేసిన సందర్భంలోనూ ఇదే విధంగా వ్యవహరించారు. ఆ గ్రామంలోని పెద్దమనిషి దేవస్థానంలో ఒక అక్రమ పని చేస్తే మంచి బహుమతి ఇస్తామని ప్రలోభానికి గురిచేసిన సందర్భంలో తనకు తప్పుడు పనులు తెలియవని చాలా కఠినంగా చెప్పిన ఆదర్శ ఉద్యోగి సోమేశ్వరరావు. అలాగే మరో దేవస్థానంలో ఒక వ్యక్తి తనకు అనుకూలంగా ఒక మాట చెప్పమని, ఒక క్యాన్ నిండా తాజా వెన్నపూస తెచ్చి ఇస్తే అతనిపై మండిపడి తీవ్రంగా గద్దించారు. ఈ రెండు ఘటనలు ఉదాహరణకు మాత్రమే. ఇంకా సోమేశ్వరరావు ఉద్యోగ నిర్వహణలో ఎన్నెన్నో ఆదర్శ సంఘటనలున్నాయి.

దశాబ్దకాలం పాటు తన ఆరోగ్యం చెడిపోయి, పార్టీకి సేవ చేయలేని సందర్భంలో తన భార్య సీతను పార్టీకి సేవ చేయాలని ప్రోత్సహించారు. పాలకొల్లు పట్టణం పంచారామల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో చేనేత పరిశ్రమ అతిపెద్దది. చేనేత సొసైటీ, చేనేత కార్మిక సంఘం చాలా బలంగా ఉండేది. పట్టణం చుట్టూ ఉన్న గ్రామాల్లో కూడా చేనేత సొసైటీలు బాగా పనిచేసేవి. మెజారిటీ పార్టీ కుటుంబాలు, కమ్యూనిస్టు కుటుంబాలు. 1948-52 సంవత్సరాల్లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వీర తెలంగాణ ప్రజాపోరాటం కాలంలో అజ్ఞాతంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ నాయకులకు, ప్రధానంగా, పాలకొల్లు చేనేత కుటుంబాలు ప్రాణాలకు తెగించి, కమ్యూనిస్టు పార్టీ నాయకులకు రక్షణగా నిలిచాయి. చేనేత కుటుంబాల్లోని స్త్రీలు ముఖ్యంగా సోమేశ్వరరావు తల్లి వెంకటరత్నం, బాసిన వెంకటరత్నం, సత్యం తల్లి నూకమ్మ, అయిరెడ్డి చాయమ్మ, తదితర మాతృమూర్తులు కన్న తల్లుల మాదిరి భోజనాలు పెట్టి రహస్యంగా కాపాడారు. సోమేశ్వరరావు తండ్రి ఏలూరి సత్యం పాలకొల్లు చేనేత సొసైటీలో, గుమస్తాగా ఉద్యోగం చేస్తూ, చేనేత సంఘానికి, కమ్యూనిస్టు పార్టీకి సేవలందిస్తూ సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ నాటికీ 92 సంవత్సరాల వృద్ధాప్యంలో కూడా పార్టీ కార్యక్రమాలే తనకు బలాన్నిస్తాయి అంటూ కమ్యూనిస్టు నేత యర్రా కృష్ణారావు, అమరులు మానం నరసింహమూర్తి, చల్లా కోటిలింగం, తూతిక మావుళ్లయ్య తదితరులు సొసైటీ డైరెక్టర్లుగా ఉండేవారు. సోమేశ్వరరావు తండ్రి ఆంధ్రప్రదేశ్ చేనేత ఆప్కో బోర్డు రాష్ట్ర ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా తరపున పోటీ చేసి ఘన విజయం సాధించారు. పాలకొల్లులోని చేనేత సంఘమే కమ్యూనిస్టు పార్టీకి బలమైన ఆయుధంగా పనిచేసేది. తల్లిదండ్రుల వారసత్వంతో ఈ దోపిడీ వ్యవస్థను ఎదిరించి ఉద్యోగ ధర్మం నిర్వహించిన ధన్యజీవి సోమేశ్వరరావు.

1964-66 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులను, మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య సహా కేంద్రప్రభుత్వం డిటెన్షన్ చట్టం కింద అరెస్టు చేసి జైళ్లలో నిర్బంధించిన సందర్భంలో అల్లూరి సత్యనారాయణ, ఆర్ఎస్ కూడా డిటెన్షన్ చట్టానికి గురయ్యారు. పాలకొల్లు చేనేత కాలనీలోని ఆయన ఇంట్లో ముగ్గురు చిన్న పిల్లలతో ఒంటరిగా ఏ రక్షణా లేని తాటాకు ఇంట్లో ఉండేవారు. కాలనీలో ఉన్న చేనేత కుటుంబాలు తనను వెయ్యి కళ్లతో కాపాడారు. ఏలూరి సత్యం కొడుకు సోమేశ్వరరావు, చల్లా కోటిలింగం కొడుకు వీరభద్రరావు ఇద్దరూ సాయంత్రం స్కూలు నుంచి ఇంటికి వచ్చి చదువుకుని, తనకూ, పిల్లలకూ తోడుగా పడుకునేవారు. చిన్న వయసులో ఆ ఇద్దరూ సహాయంగా ఉండేవారు. ఆ రోజుల్లో ఆ ప్లిలల సహాయం మరువలేనిది. ఆ కష్టకాలంలో వారి ఆదరణ, వారి సామాజిక చైతన్యం వివరించలేనిది.

సోమేశ్వరరావు గుండె జబ్బుతో పోరాడుతూనే ధైర్యంగా చివరివరకూ, తన ఉద్యోగధర్మం నిర్వహించారు. తన నలుగురు పిల్లలకు, తల్లిదండ్రుల వైపు బంధువులకు, సమసమాజం కోసం పాటుపడే సిపిఎంకు సహాయ, సహకారాలు అందించారు. 2015 ఫిబ్రవరి 12వ తేదీన ఆయన సతీమణి సీతకు, తన దగ్గరున్న అందరికీ సెలవు చెప్పి కన్నుమూశారు. అతని వ్యక్తిత్వం చిన్ననాటి నుంచి అనేక కష్టాల జీవనయాత్రలో ఎన్ని పరీక్షలు ఎదురైనా ఏనాడూ తను నమిన్న ఆశయాన్ని వదల్లేదు. నిండైన మంచి మనసుతో అందరినీ ఆదరించి చివరివరకూ సామాజిక స్ఫూర్తితోనే కన్నుమూసిన ధన్యజీవి సోమేశ్వరరావు. 14 సంవత్సరాలపాటు భర్త ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, అహర్నిశలు వెయ్యికళ్లతో గమనిస్తూ భార్య సీత వైద్యం చేయించారు. ఒకవైపు భర్త, పెద్ద వయసులో మంచంపై నుంచి లేవలేని అత్తను చూసుకుంటూ అందరికీ ఆధారమైన సతీపాత్ర అద్భుతం. అందరికీ ఆదర్శం. ఆ ఆదర్శ దంపతులకు నలుగురు బిడ్డలు.

నేడు ఎనిమిదో వర్ధంతి

ఈనెల 12వ తేదీన సోమేశ్వరరావు ఎనిమిదో వర్ధంతి. ఈ సందర్భంగా ఆయన ఆశయాలు, నీతి, నిజాయితీ అందరికీ ఆదర్శప్రాయం.

- అల్లూరి మన్మోహిని


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు సునిత

జాతీయ స్థాయి పోటీలకు కస్తూరిబా విద్యార్థినులు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 3, 4, 5 తేదీల్లో నుజివీడులో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-14 విభాగంలో ప్రథమ స్థానం సాధించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టులో కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కస్తూరిబా విద్యార్థినులు ఎ.రుత్విక, జి.పూజిత, పి.నందినిలను ప్రధానోపాధ్యాయులు జి.సునిత అభినందించారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో వాసవీ క్లబ్ సభ్యుడు మృతి


ప్రజాశక్తి - నూజివీడు


రామలింగేశ్వరరావు (ఫైల్)

నూజివీడు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవి క్లబ్ సభ్యులు పేర్ల రామలింగేశ్వరరావు (రాము) విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందారు. ఇంటి నిర్మాణ పనులు జరుగుతూ ఉండగా విద్యుదాఘాతానికి గురైనట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు చెప్పారు. రామలింగేశ్వరరావు మృతి పట్ల పట్టణ ప్రముఖులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు రామలింగేశ్వరరావు మృతికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన మృతితో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బావిలో పడి వ్యాపారవేత్త మృతి

ప్రజాశక్తి - నూజివీడు


ప్రభాకరరావు (ఫైల్‌ఫోటో)

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దోసపాటి ప్రభాకరరావు (66) శనివారం తెల్లవారుజామున బావిలో పడి మృతి చెందారు. ఎప్పటి లాగానే మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ప్రభాకరరావు ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. సమీపంలో ఉన్న బావిలో ఆయన మృతదేహం తేలుతూ ఉండడంతో బయటకు తీశారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనారోగ్య కారణాలతోనే ప్రభాకరరావు ఆత్మహత్య చేసుకుని ఉంటారని మరో కథనం వినిపిస్తోంది.


పరిశీలిస్తున్న పోలీసులు

పట్టపగలు చోరీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలు దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని దర్భగూడెం పంచాయతీలోని చీమలవారిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. చీమలవారిగూడేనికి చెందిన మహిళ పూసం శ్రీదేవి శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలం పనులకెళ్లింది. తిరిగి సాయంత్రం ఆరు గంటలకు వచ్చేసరికి తాళం పగులకొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నాయి. బీరువాలో ఉన్న ఆరు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. దీంతో బాధిత మహిళ శ్రీదేవి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


దగ్ధమవుతున్న గడ్డివామి

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయిలోని దళితవాడలోని సాదు బాబూరావుకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమైంది. దళితవాడలోని నివాసం ఉండే తన గృహం సమీపంలో నాలుగు ఎకరాల వరిగడ్డి పశువుల మేత కోసం తెచ్చి పెట్టుకోగా శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. వరిగడ్డి వామి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో చుట్టుపక్కల వారు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ విసన్నపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక కేంద్రం సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు. పెద్ద ఎత్తున మంటలు చెలరేగటంతో చుట్టుపక్కల వాకె భయాందోళనకు గురయ్యారు. నాలుగు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం కావడంతో సుమారు రూ.50 వేల నష్టం జరిగిందని యజమాని సాదు బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు.

చెరువులో దిగి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - భీమడోలు

చెరువులోనికి దిగిన యువకుడు మృతి చెందిన ఘటన సంఘటన శనివారం భీమడోలులో చోటు చేసుకుంది. భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... భీమడోలు సోమా కాలనీకి చెందిన మాగంటి వంశీ కుమార్(19) శనివారం సాయంత్రం హైస్కూల్ సమీపంలో పశువులకు ప్రత్యేకించిన తిమ్మన చెరువులోకి దిగిన గేదెలను బయటికి తెచ్చేందుకు అతను కూడా చెరువులోకి దిగాడు. అదే సమయంలో ఫిట్స్ రావడంతో చెరువులో మునిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలోని అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని చెరువులో మునిగిపోయిన వంశీ కుమార్‌ను వెతికి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉన్న వంశీకుమార్‌కు చికిత్స చేస్తుండగా చనిపోయినట్లు వైద్యాధికారులు తెలిపారు.

సహకార సంఘాల్లో అక్రమాలు..!


హెచ్‌ఆర్ సర్వీస్ రిజిస్టరు వెరిఫికేషన్‌పై వసూళ్ల దందా!

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో అక్రమాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. సొసైటీల్లో సొమ్ముల దుర్వినియోగం, రుణాల మంజూరులో అవినీతి ఆరోపణలకు తోడు ఉద్యోగ సిబ్బంది హెచ్‌ఆర్ సర్వీస్ రిజిస్టరు వెరిఫికేషన్‌లలో అక్రమ వసూళ్లు పెద్దఎత్తున జరగడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నట్లు తెలుస్తుంది. పిఎసిఎస్ ఉన్నతాధికారుల పేరుతో ఓ మండలస్థాయి అధికారి చేస్తున్న వసూళ్ల దందా రోజురోజుకు మితి మీరిపోవడంతో ఉద్యోగులు లోలోపల తీవ్ర మనస్తాపం చెందుతున్నట్లు సమాచారం. ఉద్యోగుల హెచ్‌ఆర్ సర్వీస్ రిజిష్టరు వెరిఫికేషన్ నెపంతో సొసైటీ ఉద్యోగుల నుంచి ముడుపుల కోసం ఉన్నతాధికారుల పేరు చెప్పుకుంటూ ఓ మండల స్థాయి ఇన్‌స్పెక్టర్ ఒక్కొక్క ఉద్యోగి నుంచి ఐద నుంచి 20 వేల వరకు గుంజుతున్నాడని పలువురు వాపోతున్నారు. ఇతర మండలాల ఇన్‌స్పెక్టర్ల ప్రమేయం లేకుండా ఉన్నతాధికారులు తాను ఏం చెప్తే అదే చేస్తారని ఇతర ఉద్యోగులను నమ్మిస్తూ పెత్తనం చెలాయించడం పలువురు సొసైటీ ఉద్యోగులకు మింగుడు పడటం లేదు. తన మాట వినని ఇతర ఉద్యోగులపై కక్షపూరితంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ ఇబ్బంది పెట్టడంతో ఇతర ఉద్యోగులు మౌనం వహిస్తున్నారని తెలుస్తుంది. పోలవరం సబ్ డివిజన్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు 36 ఉన్నాయి. జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో సుమారు 150 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పాత సర్వీస్ రిజిస్టర్లను తొలగించి నూతనంగా హెచ్‌ఆర్ పాలసీ సర్వీస్ రిజిస్టరు అమలు చేయడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పిఎసిఎస్ ఉద్యోగుల హెచ్‌ఆర్ సర్వీస్ రిజిస్టరు వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. దీని ఆధారంగానే ఉద్యోగుల జీతాలు పెంపుదల ఉంటుందనే కారణంతో అక్రమ వసూళ్ల దందాకు తెరలేపారని వెల్లడైంది. ఉద్యోగుల సర్వీసు రిజిస్టరులో లోపాలను కప్పి పుచ్చేందుకు ఒక్కొక్క ఉద్యోగి నుంచి రూ.20 వేల వరకు వసూలు చేయడం గమనార్హం. గతంలో హెచ్‌ఆర్ సర్వీసు రిజిస్టరు వెరిఫికేషన్‌లలో అవకతవకలు జరిగాయని ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో మళ్లీ పారదర్శకంగా వెరిఫికేషన్ జరపాలని ఆదేశించారు. ప్రతిమండలంలో మండల స్థాయి ఇన్‌స్పెక్టర్ హెచ్‌ఆర్ సర్వీస్ రిజిస్టరును వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. అయినప్పటికీ ఉన్నతాధికారుల అండతో ఈ దళారి ఉద్యోగి ఇతర మండలాల ఇన్‌స్పెక్టర్ల ప్రమేయం లేకుండా సర్వీస్ రిజిస్టరు వెరిఫికేషన్ చేయడం జరుగుతుందని తెలుస్తుంది. ఇతర ఇన్‌స్పెక్టర్లు, యూనియన్‌పై కూడా పెత్తనం చెలాయిస్తూ అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల పేరు చెప్పడంతో మిగతా ఉద్యోగులందరూ ఆ దళారిని ఎదిరించలేని పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. అక్రమ వసూళ్లపై ప్రశ్నించిన సహోద్యోగులపై ఆరోపణలు చేసి షోకాజ్ నోటీసులు జారీ చేయిస్తున్నందున సిబ్బంది మౌనం వహించాల్సి వస్తుందని తెలుస్తుంది. జిల్లా కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికల్లో కూడా ఈ వ్యక్తి ఇతర ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేశారని వెల్లడైంది. సొసైటీ ఉద్యోగులపై పెత్తనం చెలాయిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మండల స్థాయి ఇన్‌స్పెక్టర్‌పై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించి సిబ్బంది పడుతున్న మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఇ-క్రాప్‌లో నమోదైతేనే ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి - భీమడోలు


ఇ-పంట నమోదు కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు

పంట పండించే అసలైన రైతులకు పథకాలను వర్తింపజేసేందుకు ప్రభుత్వం ఇ-పంట విధానాన్ని ప్రవేశపెట్టిందని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వై.రామకృష్ణ తెలిపారు. భీమడోలు మండల పర్యటనకు వచ్చిన సంయుక్త సంచాలకులు అమలులో ఉన్న ఇ-పంట విధానం నమోదు విధివిధానాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పంట సాగు చేసేది ఒకరు లబ్ధి చేకూరేది మరొకరికి అనే ఆరోపణలు ఉండేవన్నారు. వీటన్నిటినీ సరిచేసి పారదర్శకంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ విధానం వల్ల కౌలు రైతులకు సైతం లబ్ధి చేకూరుతుందని వివరించారు. జిల్లా పరిధిలో 2.72 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు జరుగుతుండగా, ఇప్పటివరకు 2.22 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రైతులు ఇ-పంట విధానంలో తమ వివరాలను ప్రాథమికంగా నమోదు చేశారన్నారు. ఈ నెల 26తో నమోదు గడువు ముగిస్తున్న నేపథ్యంలో మిగిలిన రైతులు సైతం ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. రైతు తాను పండించే పంట వివరాలు, సర్వే నెంబర్ ఇతరాలను రైతు భరోసా కేంద్రానికి చెందిన వ్యవసాయ సహాయకుల వద్ద తొలుత నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వీటిని నిర్ధారించిన వ్యవసాయ సహాయకులు ఆ వివరాలను గ్రామ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తారన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి వాటిని ఖరారు చేసిన తర్వాత వీటి వివరాలను వ్యవసాయ అధికారి, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్తారన్నారు. తిరిగి అధికారుల వద్ద ఖరారైన వివరాలను అధికారిక నమోదుగా గుర్తించేందుకు వాటి వివరాలను తిరిగి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుకు తెలియజేసి నమోదైన వివరాల పట్ల వారు సంతృప్తి చెందినట్లుగా రైతు వేలిముద్రను రైతు భరోసా కేంద్రం వద్ద తీసుకుంటారన్నారు. ఆ తరువాత రైతుకు ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధి చేకూరుతుందని, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, అమ్మకాలు ద్వారా రైతుకు గిట్టుబాటు ధర కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ మేరకు జిల్లా పరిధిలో 47 శాతం మంది రైతులు తాము వేలిముద్ర వేయడం ద్వారా ఈ పంట నమోదు కార్యక్రమానికి తమ అంగీకారాన్ని తెలియజేశారన్నారు. మిగిలిన రైతుల సైతం రైతు భరోసా కేంద్రం వద్ద తమ ఈ పంట వివరాలు ఖరారు చేసుకున్నందుకు వేలిముద్ర నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమడోలు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి, వ్యవసాయ అధికారి ఉషారాణి పాల్గొన్నారు.

స్మార్ట్ లివింగ్ విధానాలపై అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు



వ్యవసాయక్షేత్రాల్లో సస్యభారత్ కార్యక్రమంలో నిర్వహిస్తున్న శ్రీచైతన్య విద్యార్థులు

భీమడోలు శ్రీ చైతన్య పాఠశాల ప్రతినెల నిర్వహించే కో కరిక్రులం కార్యక్రమంలో భాగంగా శనివారం స్మార్ట్ లివింగ్ విధానాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించామని ప్రిన్సిపల్ బి.సోహిని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాఠశాల అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు భాగస్వామ్యంతో భీమడోలు రైతు భరోసా కేంద్రం-3 పరిధిలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో సస్య భారత్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ కార్మికుల వేషధారణలతో దీనిలో పాల్గొన్న విద్యార్థులు వ్యవసాయ పనుల్లో రైతులతో పాటు మమేకమై వ్యవసాయ అనుభవాన్ని పొందారన్నారు. విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నలకు రైతులు తమ అనుభవాలతో సమాధానం అందించారని తెలి పారు. ఈ విషయమై ఉపాధ్యాయులు సం ధానకర్తలుగా వ్యవ హరించారన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పనులు, రైతులకు వ్యవసాయానికి అనుబంధంగా చేపట్టే పాడి పెంపకం ఇతర అంశాల పట్ల అవగాహన కల్పించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ భార్గవ కిరణ్, ఎఒ ముఖేష్ పాల్గొని విద్యార్థులకు సహకారం అందించారని తెలిపారు.

రోడ్డంతా దుమ్ముమయం..!

ఇబ్బందుల్లో వాహనదారులు

ప్రమాదాలకు గురవుతున్న వైనం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



బుట్టాయగూడెం మండల కేంద్రంలోని హైస్కూల్ సెంటర్ వద్ద నుంచి బుసరాజుపల్లి శివారు కొత్త చేగుంటపల్లి వరకు రోడ్డంతా దుమ్ముమయంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను రూ.3.10 కోట్ల ఎఎంసి నిధులతో పంచాయతీ రాజ్ ద్వారా చేపట్టారు. ఈ నిర్మాణ పనులకు గత నెలలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శంకుస్థాపన చేశారు. కొంతకాలం వరకు రోడ్డు పనులు బాగానే జరిగాయి. ప్రజలు కొంతకాలంగా ఇప్పలపాడు సమీపంలోని పెట్రోలు బంకు నుంచి పైదవారిగూడెం మధ్య ఉన్న రోడ్డు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ రోడ్డు కూడా పూర్తిగా పాడైపోయింది. దీంతో మళ్లీ బుసరాజుపల్లి శివారు కొత్త చేగుంటపల్లి రోడ్డును వినియోగిస్తున్నారు. రోడ్డుపై వేసిన డస్టు కంకర మిశ్రమం వల్ల విపరీతమైన దుమ్ము పైకి లేచిపోతుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహనదారుల కళ్లల్లో దుమ్ము పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఇళ్లలో నివాస ఉంటున్న ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దుమ్ము కారణంగా ప్రజలు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డు కంటే వెనుక ప్రారంభమైన బుట్టాయగూడెం - కన్నాపురం రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని, కానీ ఈ రోడ్డు ఎందుకు ఇంకా పూర్తి చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డును త్వరగా నిర్మించాలని కోరుతున్నారు.



రోడ్డుపై లేచిపోతున్న దుమ్ములో వాహనదారుల ఇబ్బందులు

13న జాతీయ రహదారి దిగ్బంధం : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - చాట్రాయి

ఎబిసిడి వర్గీకరణకు మద్దతు తెలిపిన కేంద్ర ప్రభుత్వం ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తీవ్ర జాప్యానికి నిరసనగా ఈ నెల 13వ తేదీన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధం చేస్తామని మండల మహాజన సోషలిస్టు పార్టీ చాట్రాయి కన్వీనర్ మొలుగుమాటి రవిరామ్ తెలిపారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు, మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు చాట్రాయి మండల్ కన్వీనర్ మొలుగుమాటి రవిరామ్ మాదిగ ఆధ్వర్యంలో మండలంలో అన్ని గ్రామాల్లో జాతీయ రహదారి దిగ్బంధానికి సమావేశాలు నిర్వహించి, వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తుమ్మగూడెం గ్రామ కమిటీ మెంబర్స్ కాంతారావు మాదిగ, జ్యానేష్ మాదిగ, రాజేంద్ర మాదిగ పాల్గొన్నారు.

ముసునూరు : ఈ నెల 13వ తేదీన ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా కో-కన్వీనర్ తోమంద్రు రుద్రయ్య, ఎంఎస్‌ఎఫ్‌ఎస్ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ కంకట వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రమైన ముసునూరు జగన్‌జీవన్‌రామ్ సెంటర్ వద్ద ఎంఆర్‌పిఎస్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుద్రయ్య మాట్లాడుతూ ఎంతో మంది ముఖ్యమంత్రులు మారుతున్నరే తప్ప మాదిగలకు ఏ పార్టీ మేలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి జాబితాలో మాదిగల్లో ఎబిసిడిలుగా విభజించి ఆందరికి సమన్యాయం చేస్తామని హామీ ఇచ్చినంతగా, విభజన చట్టం తీసుకురావడంలో బిజెపి కూడా మొండి చేయి చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో చిలీ అర్లప్ప, చిలీ పండు, కె.వేణు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాజ్యాంగం అపహాస్యం : టిడిపి

ప్రజాశక్తి - నూజివీడు

జగన్ పాలనలో వాక్ స్వాతంత్రం కూడా లేకుండా రాజ్యాంగాన్ని అపహాస్యం పాలు చేసేలా పోలీస్ వ్యవస్థ నడుస్తుందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్ర చేస్తున్న టిడిపి యువ నాయకులు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మైక్‌లో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. యువగళంతో వైసిపి పునాదులు కదులుతున్నాయనే భయంతో పాదయాత్రను అడుగడుగునా అడ్డుకునేందుకు ఇప్పటికే లోకేష్‌పై మూడు కేసులు పెట్టారని, మైకు వాహనాలను సైతం సీజ్ చేశారని పేర్కొన్నారు. ప్రజలతో మాట్లాడనీయకుండా వాక్ స్వాతంత్రాన్ని కూడా ఇవ్వకుండా పోలీస్ చట్టాన్ని ఉపయోగిస్తూ వైసిపి ప్రభుత్వం రాక్షస ఆనందాన్ని పొందుతుందన్నారు. ఒకవైపు జగన్ నియంతృత్వ పోకడలను తట్టుకోలేక సొంత ఎంఎల్ఎలే ఒక్కొక్కరిగా బయటకు వస్తూ ప్రభుత్వ అసమర్ధ విధానాలపై ప్రశ్నిస్తున్నారన్నారు. దీంతో జగన్ రెడ్డి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గద్దె రఘు బాబు, టిడిపి నాయకులు మందలపు గంగాధరరావు, బర్మా శేషగిరిరావు, బోగోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫలించిన పోరాటం

రైతులకు నష్టపరిహారం

ప్రజాశక్తి - నూజివీడు

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బేయర్ కంపెనీ సీడ్ మొక్కజొన్నతో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి నిరవధిక పోరాటం జరిగింది. దీంతో శనివారం చర్చలకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు, నష్టపోయిన రైతులకు ఒకొక్క ఎకరానికి రూ.75 వేలు చొప్పున 125 ఎకరాల్లో పంట నష్టానికి కంపెనీ నష్టపరిహారం చెల్లిస్తుందని రైతులకు ప్రకటించారు. ఈ చర్చల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, మండల కార్యదర్శి బోనాల దశరధ్‌రాం పాల్గొన్నారు.